# నోటిఫికేషన్స్

## ప్రవేశాలు

### బనారస్ హిందూ వర్సిటీలో బీఫార్మసీ

**యూ**పీ రాష్ట్రం వారణాసిలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఆయుర్వేద ఫ్యాకల్టీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ బీఫార్మసీ (ఆయుర్వేదం)- సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ స్పెషల్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
**సీట్ల సంఖ్య:** 37. **వ్యవధి:** నాలుగేళ్లు.
**అర్హత:** కనీసం 50% మార్కులతో ఇంటర్మీడియట్/10+2 (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టులు).
**వయసు:** 31-12-2023 నాటికి 17- 25 సంవత్సరాల మధ్య ఉండాలి. **సీటు కేటాయింపు:** ప్రవేశ పరీక్ష, రిజర్వేషన్ ఆధారంగా. **దరఖాస్తు రుసుము:** జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1200, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.900.

**ఎంఫార్మసీ**

**బ**నారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఆయుర్వేద ఫ్యాకల్టీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎంఫార్మసీ (ఆయుర్వేదం)- సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ స్పెషల్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
**సీట్ల సంఖ్య:** 15. **వ్యవధి:** రెండేళ్లు. **అర్హత:** కనీసం 50% మార్కులతో గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి బీఫార్మసీ (ఆయుర్వేదం). **సీట్ల కేటాయింపు:** ప్రవేశ పరీక్ష, రిజర్వేషన్ ఆధారంగా. **దరఖాస్తు రుసుము:** జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.1000.

***ఈ రెండు కోర్సులకూ...***

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 11-9-2023.
**ప్రవేశ పరీక్ష:** 24-09-2023.
**వెబ్‌సైట్:** https://www.bhu.ac.in/

### ఐఐఎం ఇందౌర్‌లో పీజీ ప్రోగ్రామ్

**ఐ**ఐఎం ఇందౌర్.. ముంబయి క్యాంపస్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
**అర్హత:** బ్యాచిలర్ డిగ్రీతో పాటు సంబంధిత రంగంలో కనీసం అయిదేళ్ల పని అనుభవం. **ఎంపిక:** ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు రుసుము:** రూ.5000.
**దరఖాస్తుకు చివరి తేదీ:** 09-10-2023.
**ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూ:** 15-10-2023.
**తరగతుల ప్రారంభం:** నవంబర్/డిసెంబర్, 2023.
**వెబ్‌సైట్:** https://www.iimidr.ac.in/

## ప్రభుత్వ ఉద్యోగాలు

### సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌లో...

**న్యూ**దిల్లీలోని ప్రభుత్వ మినీ రత్న సంస్థ- సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
● అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్): 18 ● అసిస్టెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్): 05 ● అకౌంటెంట్: 24 ● సూపరింటెండెంట్ (జనరల్): 11 ● జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్: 81
● సూపరింటెండెంట్ (జనరల్)- ఎస్ఆర్‌డీ (ఎన్ఈ): 02
● జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్- ఎస్ఆర్‌డీ (ఎన్ఈ): 10
● జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్- ఎస్ఆర్‌డీ (లడఖ్ యూటీ): 02
**అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ (సివిల్/ ఎలక్ట్రికల్/ అగ్రికల్చర్), డిగ్రీ (జువాలజీ, కెమిస్ట్రీ/ బయో కెమిస్ట్రీ), బీకాం, బీఏ, సీఏ, పీజీ.
**వయసు:** 24-09-2023 నాటికి జేటీఏ ఉద్యోగాలకు 28 ఏళ్లు, ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
**ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
**దరఖాస్తు రుసుము:** యూఆర్, ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ పురుష అభ్యర్థులకు రూ.1250. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ పీహెచ్/ ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.400.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 24-09-2023.
**వెబ్‌సైట్:** https://cewacor.nic.in/

### మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సులు

**గుం**టూరులోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, ట్రామా కేర్ సెంటర్ 19 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
● జనరల్ సర్జన్ (న్యూరో సర్జన్): 2
● ఆర్థోపెడిక్ సర్జన్: 1 ● అనస్థటిస్ట్: 2
● క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్: 8
● స్టాఫ్ నర్స్: 5 ● ల్యాబ్ టెక్నీషియన్: 1
**అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఎంఎల్‌టీ, డిప్లొమా, జీఎన్ఎం, ఎంబీబీఎస్, పీజీ, పీజీ డిప్లొమా.
**వయసు:** 42 సంవత్సరాలు మించకూడదు.
**దరఖాస్తు రుసుము:** ఓసీ/ బీసీ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.300.
**ఎంపిక:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రిజర్వేషన్ ఆధారంగా.
**దరఖాస్తు:** ఆఫ్‌లైన్ దరఖాస్తులు వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా 'సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, గుంటూరు' చిరునామాకు పంపించాలి.
**దరఖాస్తుకు చివరి తేదీ:** 04-09-2023.
**వెబ్‌సైట్:** https://guntur.ap.gov.in/

### చిత్తూరు జిల్లాలో ల్యాబ్-టెక్నీషియన్, అకౌంటెంట్‌లు

**చి**త్తూరులోని డిస్ట్రిక్ట్ హెల్త్ అండ్ ఫ్యామిలీవెల్ఫేర్ సొసైటీ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 17 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్: 01
● సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్-సూపర్‌వైజర్: 06
● ల్యాబ్-టెక్నీషియన్: 03 ● డీఆర్‌టీబీ కౌన్సెలర్: 01
● అకౌంటెంట్: 02 ● సీనియర్ మెడికల్ ఆఫీసర్: 01
● డీపీసీ: 01 ● డీపీఎస్: 01 ● పీపీఎం కోఆర్డినేటర్: 01
**అర్హత:** పోస్టును అనుసరించి ఇంటర్, డీఎంఎల్‌టీ, డిప్లొమా, ఎంబీబీఎస్, పీజీ, డిగ్రీ, సర్టిఫికెట్ కోర్సు, ఎంబీఏ, పీజీ డిప్లొమా .
**ఎంపిక:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రిజర్వేషన్ ఆధారంగా.
**దరఖాస్తు:** ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీస్, ఓపీ నెం.24, జిల్లా హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్ క్యాంపస్, చిత్తూరు' చిరునామాకు పంపించాలి.
**దరఖాస్తుకు చివరి తేదీ:** 30-08-2023.
**వెబ్‌సైట్:** https://chittoor.ap.gov.in/



**విద్య, ఉద్యోగం, ఆట, పాట.. ఎందులో టాపర్‌గా నిలవాలన్నా మంచి అలవాట్లు, చక్కని ప్రణాళిక ఎంతో కీలకం. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే వీటిని ప్రణాళికతో అమలు చేస్తే భవిష్యత్తులో కోరుకున్న విభాగంలో రాణించడం సులువవుతుంది. రోజు తరగతులకు హాజరై, అసైన్‌మెంట్లు పూర్తిచేస్తే సరిపోదు. దీంతోపాటు ఆచరించాల్సిన ఇతర అంశాలెన్నో ఉన్నాయి. వాటిని దినచర్యలో భాగం చేసుకోవాలి!**

# ఇవి పాటిస్తే.. మీరే టాపర్!

**వి**జ్ఞానాన్ని పెంపొందించుకోవడం ఒక్కటే విజయాన్ని అందించలేదు. ముఖ్యమైన జీవన నైపుణ్యాలను అలవర్చుకున్నవారే జీవితంలో రాణించగలరు. మేటి అకడమిక్ పరిజ్ఞానంతోపాటు విశ్వ నైపుణ్యాలను సొంతం చేసుకున్నవారు వృత్తి జీవితంలోకి ధైర్యంగా అడుగుపెట్టి, రాణించగలరు. జిజ్ఞాస, సమర్థ సమయ పాలన, బుద్ధి స్థిరత్వం, వేగంగా సంగ్రహించుకోగలగడం.. ఇలా ఎన్నో అంశాలు విజయాన్ని ప్రభావితం చేస్తాయి.

## సమయం

ఇది ఎంతో విలువైన వనరు. విద్యార్థులకు చాలా ముఖ్యమైనది. దీన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి కాలపట్టీ కీలకం. చదువుకునే సమయం, విరామం, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్, పర్సనల్ రిలాక్సేషన్ వీటన్నింటినీ దినచర్యలో భాగం చేయాలి. వీటిని తప్పనిసరిగా ఆచరణలో పెట్టాలి. దీంతో విద్య, వ్యక్తిగత జీవితం మధ్య సమన్వయం కుదురుతుంది. సమయ పాలనపై పట్టు దక్కుతుంది.

## లక్ష్యాలు

విద్యార్థి దశ నుంచే స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. అవి అధిగమించే విధంగా ఉండాలి. అలా జరగాలంటే ఆ లక్ష్యాల వెనుక బలమైన కారణాలు ఉండాలి. వాటిని అందుకోవాలంటే ఏం చేయాలో ప్రణాళిక తప్పనిసరి. లక్ష్యం బాగా పెద్దదైనప్పుడు చిన్నవిగా విభజించుకోవాలి. గడువు నిర్దేశించుకుని ఒక్కొక్కటీ పూర్తి చేయాలి. దీంతో ఆత్మవిశ్వాసం పెంపొంది, తర్వాత లక్ష్యాలను చేరుకోవడం వీలవుతుంది. అప్పుడప్పుడూ వీటిని సమీక్షించుకోవడమూ తప్పనిసరి. అలాగే అవసరమైన మార్పులూ చేసుకోవాలి. లక్ష్యాలను చేరుకోలేకపోతున్నట్లైతే అందుకు కారణాలు తెలుసుకుని, అధిగమించాలి. ఇతరులతో పోల్చుకోవద్దు.

## పఠనం.. మెలకువలు

విస్తృత పరిజ్ఞానం సొంతం చేసుకోవడానికి, విశ్లేషణకు, తార్కికంగా ఆలోచించడానికి.. ఇలా ఎన్నో ప్రయోజనాలకు పుస్తకాలు బాగా చదవడం ఎంతో ముఖ్యం. అందువల్ల మీ దినచర్యలో పుస్తక పఠనం భాగం కావాలి. కేవలం అకడమిక్ పుస్తకాలకే పరిమితం కాకుండా మీరు కోరుకున్న రంగంలో లేదా మీ ఆసక్తులకు సంబంధించి లేదా మీ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన పుస్తకాలూ చదవాలి. పద సంపద పెంపొందడం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపడటంలోనూ పుస్తక పఠనం ఉపయోగపడుతుంది. ఇందుకోసం.. చదవడానికి సరైన ప్రదేశాన్ని ఎంచుకోండి. ఎలాంటి అవాంతరాలూ లేకుండా చూసుకోండి. ఫోన్ సైలెంట్ మోడ్‌లో ఉంచండి. చదివే ప్రాంతంలో అవసరమైన పుస్తకాలు, నోట్సులు, కావాల్సిన స్టేషనరీ తప్ప ఇతర ఎలాంటివీ అక్కడ ఉంచకండి. అలాగే ఎన్ని గంటలు చదివామన్నది ప్రామాణికం కాదు. ఎంత విషయాన్ని సంగ్రహించగలిగామనేది కీలకం. అందువల్ల మూసగా గంటల కొద్దీ పఠనం కొనసాగిస్తే ప్రయోజనం దక్కదు. అర గంట చదివి, ఏం తెలుసుకున్నారో ఐదు నిమిషాలు విశ్లేషించుకోవాలి. మధ్యలో చిన్న విరామం తీసుకోవాలి. మళ్లీ ఆర గంట చదువు కొనసాగించి.. ముందు చదివింది, ఇప్పుడు తెలుసుకున్నది రెండూ గుర్తుకు తెచ్చుకోవాలి. చదవడం ద్వారా గ్రహించిన ముఖ్యాంశాలు పుస్తకంలో రాసుకుంటే బాగా గుర్తుంటాయి. నిర్దిష్ట వ్యవధిలో ఒక అంశంపైనే దృష్టి సారించండి. అది పూర్తయిన తర్వాతే మరో లక్ష్యాన్ని నిర్దేశించుకోండి.

## శ్రద్ధగా వినాలి

**అ**కడమిక్స్‌లో విజయం సాధించడానికి పాఠాలు/ఉపన్యాసాలు శ్రద్ధగా వినడం ప్రాథమిక కర్తవ్యం. అలాగే విన్నదాన్ని ప్రభావవంతంగా, గుర్తుండిపోయేలా నోట్సు రాసుకోవాలి. వింటున్నప్పుడే ముఖ్యాంశాలు సంగ్రహించుకోవాలి. వినడం పూర్తయిన తర్వాత ఆ అంశాలు విశ్లేషించుకోవాలి. ఇందుకోసం ఆడియో/వీడియో ప్రసంగాలు ఉపయోగపడతాయి. వాటిని విని, రాయడాన్ని సాధన చేస్తే విషయ పరిజ్ఞానం, రాయగలిగే నైపుణ్యం పెంపొందుతాయి. ఎక్కువ రోజులు గుర్తుంచుకోవచ్చు కూడా.

## అప్‌డేట్

దేన్నైనా నేర్చుకోవడానికి పరిమితులు ఉండవు. సమాచారం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. అప్‌డేట్ అయితేనే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగలం. అందువల్ల నేర్చుకోవడం నిరంత ప్రక్రియగా గుర్తించాలి. కేవలం అకడమిక్ పరిజ్ఞానానికే పరిమితం కాకుండా వీలైనన్ని కొత్త విషయాలూ తెలుసుకోగలగాలి. దీంతో విలువైన ఆలోచనలకూ అవకాశం ఉంటుంది. మేధాపరమైన వికాసానికి నిరంతం నేర్చుకుంటూ ఉండటం దివ్యాస్త్రం లాంటిది.

## కమ్యూనికేషన్

అకడమిక్, వృత్తిగత లక్ష్యాలను అందుకోవడంలో బలమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు తప్పనిసరి. ఆలోచనలను సమగ్రంగా ఒక దగ్గర రాసుకోవాలి. అసైన్‌మెంట్లు, ప్రెజెంటేషన్లు, చర్చలు.. వీటన్నింటి ద్వారా కమ్యూనికేషన్ మెరుగుపరచుకోవచ్చు. చెప్పాలనుకున్న/రాయాలనుకున్న అంశంలో అవగాహన ఉంటే కమ్యూనికేషన్ తేలికవుతుంది. నిపుణులు ప్రసంగాలు వినడం, అవసరమైన పుస్తకాలు చదవడంతో కమ్యూనికేషన్ పెంపొందించుకోవచ్చు. పాఠశాల స్థాయిలోనే వ్యాసరచన, వక్తృత్వం, ఇతర పోటీల్లో భాగం కావాలి. చిన్న చిన్న బాధ్యతలూ తీసుకోవచ్చు.

## నెట్‌వర్కింగ్

మీ తోటివారు, నిపుణులు, మీ రంగానికి చెందిన వ్యక్తులతో అర్థవంతమైన సంబంధాలు కలిగి ఉండటం ఎంతో ముఖ్యం. దీనిద్వారా విలువైన సూచనలు పొందడం, కొత్త విషయాలు తెలుసుకోవడం, కొత్త అవకాశాలపై అవగాహన, సందేహాలు నివృత్తి చేసుకోవడం, తాజా సమాచారం గ్రహించడం ఇవన్నీ సాధ్యమవుతాయి. విద్యార్థిగా ఉన్నప్పుడే పాఠశాల పూర్వ విద్యార్థులతో మమేకం కావడం, వివిధ పోటీలు, శిక్షణలో పాల్గొనడం లాంటి అలవాట్లు పెంపొందించుకోవాలి. సానుకూల దృక్పథం, మీలాంటి లక్ష్యం ఉన్న వ్యక్తులతో స్నేహం చేయండి. మీ మెంటర్‌తో అభిప్రాయాలు పంచుకోండి. మీ సందేహాలూ నివృత్తి చేసుకోండి.

## వ్యాయామం

విద్యార్థి దశలో ఉన్నప్పుడే ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. విజయం సాధించడంలో దీని పాత్ర ఎక్కువే. అందువల్ల ప్రతి రోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలి. నడవడం, పరుగెత్తడం, ఏదైనా ఆట ఆడటం.. ఇలా మీకు ఏది ఇష్టమైతే దాన్ని చేయాలి. దీంతో ఒత్తిడి తొలగుతుంది. సానుకూల దృక్పథం అలవడుతుంది. బద్ధకం లేకుండా చూసుకోవచ్చు. అలాగే సరైన నిద్ర, సమతులాహారం రెండూ కీలకమేనని గుర్తుంచుకోండి.

**పై లక్షణాలన్నీ అలవర్చుకున్నవారు అకడమిక్స్‌లోనూ, వ్యక్తిగత జీవితంలోనూ వృద్ధి చెందగలరు. అయితే ఇవన్నీ ఒక్క రోజులోనే సాధ్యపడవు. అందువల్ల సహనం అవసరం. ప్రయత్నంతో కొద్ది వ్యవధిలోనే మేటి మార్పు దిశగా మీ ప్రయాణం మొదలవుతుంది.**

# భారత్ డైనమిక్స్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

**ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) 45 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. పోస్టులను బట్టి ఇంజినీరింగ్ డిగ్రీ, ఎంఎస్సీ, ఎంబీఏ, డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాసైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు.**

**ఎం**పికైనవారిని కార్పొరేట్ ఆఫీస్ (గచ్చిబౌలి), కంచన్‌బాగ్ (హైదరాబాద్) భానూర్ (సంగారెడ్డి జిల్లా), ఇబ్రహీంపట్నం (రంగారెడ్డి జిల్లా), విశాఖపట్నం యూనిట్‌లలో నియమిస్తారు. మొత్తం 45 పోస్టుల్లో.. మేనేజ్‌మెంట్ ట్రైనీ- ఎలక్ట్రానిక్స్-15, మెకానికల్-12, ఎలక్ట్రికల్-4, కంప్యూటర్ సైన్స్-1, సైబర్ సెక్యూరిటీ-2, కెమికల్-2, సివిల్-2, బిజినెస్ డీఈవీ-1, ఆప్టిక్స్-1, ఫైనాన్స్-2, వెల్ఫేర్ ఆఫీసర్-2, పబ్లిక్ రిలేషన్స్-1 ఉన్నాయి.

27.07.2023 నాటికి ఎంటీ ఫైనాన్స్/ వెల్ఫేర్ ఆఫీసర్/ జేఎం పోస్టులకు 28 సంవత్సరాలు, మిగతా ఖాళీలు అన్నింటికీ 27 ఏళ్లు మించకూడదు. గరిష్ఠ వయసులో ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10 ఏళ్ల మినహాయింపు ఉంటుంది. దరఖాస్తు ఫీజు రూ.500 ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్, బీడీఎల్ పర్మనెంట్ ఉద్యోగులకు దరఖాస్తు ఫీజు లేదు.

మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు రూ.40,000-1,40,000, వెల్ఫేర్ ఆఫీసర్/ జేఎం (పబ్లిక్ రిలేషన్స్) పోస్టులకు రూ.30,000-1,20,000 వేతనం ఉంటుంది. మూల వేతనంతోపాటు డీఏ, హెచ్ఆర్ఏ, బేసిక్ మీద 33 శాతం పెర్క్స్, పనితీరు ఆధారంగా చెల్లింపులు, పీఎఫ్, గ్రాట్యుటీ, వైద్య సదుపాయాలు మొదలైనవి ఉంటాయి.

### ఎంపిక ఎలా?

అభ్యర్థులను రాత పరీక్ష (కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్ సీబీటీ), ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తులో పేర్కొన్న విద్యార్హతల ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేసి.. వారికి సీబీటీ నిర్వహిస్తారు. సీబీటీ తేదీ, ప్రదేశాన్ని అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు. ఈ కార్డ్‌ను అభ్యర్థులు సంస్థ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ సమాచారాన్ని అభ్యర్థి ఈమెయిల్‌కు తెలియజేస్తారు.

● సీబీటీ ప్రశ్నపత్రంలో రెండు పార్ట్‌లు, 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పార్ట్-1లోని 100 ప్రశ్నలు సంబంధిత విభాగాలకు చెందిన సబ్జెక్టుల నుంచి ఇస్తారు. పార్ట్-2లో జనరల్ ఆప్టిట్యూడ్‌కు చెందిన 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 2 గంటలు.
● అభ్యర్థుల ఎంపికలో సీబీఓటీకి 85 శాతం, ఇంటర్వ్యూకు 15 శాతం వెయిటేజీ ఉంటుంది. సీబీఓటీలో యూఆర్/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 60 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ(ఎన్‌సీఎల్) అభ్యర్థులు 50 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. రాత పరీక్ష మార్కుల ఆధారంగా 10:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఎంపిక ప్రతి దశలోనూ కటాఫ్ మార్కులు ఉంటాయి.
● రాత పరీక్షను పది కేంద్రాల్లో (బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, చెన్నై, దిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, ముంబయి, త్రివేండ్రం, విశాఖపట్నం) నిర్వహిస్తారు. అభ్యర్థులు తమకు దగ్గరలోని పరీక్ష కేంద్రాన్ని ఆన్‌లైన్ దరఖాస్తును నింపే సమయంలోనే ఎంపిక చేసుకోవాలి.
● అన్ని పోస్టులకూ రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగానే అభ్యర్థులను ఎంపికచేస్తారు. వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుకు మాత్రం అదనంగా తెలుగులో కూడా రాత పరీక్షను నిర్వహిస్తారు. దీంట్లోని పార్ట్-1లో సబ్జెక్టు సంబంధిత, జనరల్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు ఉంటాయి. పార్ట్-2లో తెలుగు ప్రావీణ్యాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉంటాయి.

### సన్నద్ధతకు ...

పార్ట్-1లోని 100 ప్రశ్నలు సబ్జెక్టుకు సంబంధించినవే ఉంటాయి. ఇవన్నీ డిగ్రీ, పీజీలో చదివిన సబ్జెక్టుల నుంచే వస్తాయి. వీటి మీద పట్టు సాధించాలి. ముఖ్యాంశాలను పునశ్చరణ చేసుకోవాలి.
● పార్ట్-2లో జనరల్ ఆప్టిట్యూడ్‌కు చెందిన 50 ప్రశ్నలుంటాయి. ఇవి అభ్యర్థి తార్కిక పరిజ్ఞానాన్ని, విశ్లేషణా సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ఉంటాయి. పాత ప్రశ్నపత్రాలను పూర్తిచేయడం ద్వారా ఆప్టిట్యూడ్ నైపుణ్యాన్ని సమీక్షించుకోవచ్చు.
● పరీక్ష వ్యవధి రెండు గంటల్లో అన్ని ప్రశ్నలకు జవాబులు గుర్తించడం సాధన చేయాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నల సాధన అవసరం.
● అన్ని పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరి.
**దరఖాస్తుకు చివరి తేదీ:** 20.09.2023
**వెబ్‌సైట్:** https://bdl-india.in

# ఫ్రీలాన్సింగ్ చేయాలంటే?

**ఎంఫిల్ పొలిటికల్ సైన్స్ చేశాను. సాహిత్యాభిలాషిని కూడా. ఫ్రీలాన్సర్‌గా పనిచేయాలంటే ఎలాంటి నైపుణ్యాలు కావాలి? సాంకేతిక నైపుణ్యం ఎలా పెంచుకోవాలి? – అపురూప**

■ మీరు ఫ్రీలాన్సర్‌గా ఏ రంగంలో ఉండాలనుకొంటున్నారు? అందుకు సాంకేతిక నైపుణ్యం ఎందుకు అవసరం? ఈ విషయాలపై స్పష్టత లేదు. ఫ్రీలాన్సర్‌గా పనిచేయాలంటే సమకాలీన సమాజ పరిస్థితులపై స్పష్టత, నిశిత పరిశీలన, సంబంధిత పుస్తకాలను విమర్శనాత్మకంగా చదవడం, పరిశోధనలో ప్రాథమిక పద్ధతులపై అవగాహన, సృజనాత్మకత, భాషపై మంచి పట్టు, అనువాద నైపుణ్యాలు చాలా అవసరం. ఇక సాంకేతిక నైపుణ్యాల విషయానికొస్తే- కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంటర్నెట్ వాడటంలో మెలకువలు పెంపొందించుకోండి. ఎంఎస్ ఆఫీస్‌లో శిక్షణ పొందండి. తెలుగు, ఇంగ్లిష్‌ల్లో వేగంగా టైప్ చేయడం నేర్చుకోండి. చివరిగా.. ప్రాంతీయ భాషల్లో ఫ్రీలాన్సర్‌గా ఉంటే ఆకర్షణీయ వేతనాలు అంతగా ఉండవు. మీరు ఏదైనా పృత్తితో పాటు ఫ్రీలాన్సింగ్‌ని ఒక ప్రవృత్తిగా మాత్రమే పెట్టుకోండి.

**– ప్రా. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్**